# అమ్మమ్మతో కబుర్లు...

-కె.విజయలక్ష్మి

'కనబడట్లేదు' అని హాల్లో నుండి అరిచాను.

"నీ కళ్ళజోడా? ఎక్కడ పెట్టుకున్నావ్? పిల్లలు తీశారేమో అడుగు" అంటూ డ్రాయింగ్ రూమ్‌లో పేపరు చదువుకుంటోన్న తాతయ్య హాల్లోకొచ్చారు.

"ఏదీ నువ్వు రాత్రి చదువుకున్న పుస్తకమా? ముందు రూమ్‌లో పెట్టుకున్నావేమో చూసుకో" అంటూ పూజ గదిలో నుండి అమ్మమ్మ వచ్చింది.

"నిన్న కొన్న పర్సా? ఛేంజ్‌కావాలా" అంటూ ఆఫీస్‌కి బయల్దేరిన నాన్నగారు లోపలికి వచ్చారు.

"నీ టిఫెన్ బాక్స్ డైనింగ్ టేబుల్ మీద పెట్టాను. ఆ మాత్రం తీసుకోలేవూ? అది కూడా తెచ్చి ఇవ్వాలా?" అంటూ వంటింట్లోంచి వచ్చింది అమ్మ.

"నిన్న ఉతికిన చీర అల్మారాలో పెట్టాను ఆ మాత్రం చూసుకోలేవా" విసుక్కుంటూ బెడ్ రూమ్‌లో నుండి బుజ్జి గాడితో సహా వచ్చింది అక్కయ్య.

"అక్కా! నీపెన్ను నేను తీసుకోలేదు ఒట్టు" అంటూ వరండాలో ఆడుకుంటోన్న తమ్ముడు వచ్చాడు.

"ఇంతకీ నీకేం కనబడట్లేదు." అని అందరూ ఒకేసారి అడిగారు.

"మనశ్శాంతి" అని తాపీగా సమాధానమిచ్చాను.

"నిన్నటి దాకా బాగానే ఉన్నావ్‌గా" అంతలోనే ఏమైందే?" అమ్మ అడిగింది కంగారుగా.

"ఏం జరిగిందో అర్థమయ్యేట్లు చెప్పు" అని నాన్నగారు గద్దించారు.

"నాన్నా పూర్వకాలం మనిషి, పల్లెటూళ్ళ నుండి తాలూకాకు, తాలూకాల నుండి పట్టణాలకు, పట్టణాల నుండి విదేశాలకు, చంద్రమం డలం దాకా వెళ్ళొచ్చాడు. అయినా మానవునికి మనశ్శాంతి లేదు. ఎందుకంటారూ?' అడిగాను.

"ప్రొద్దున్నే స్పీచ్ మొదలెట్టావా? స్పీచ్ ఇవ్వటానికి నీకు టైముందేమో కాని వినటానికి మాకు టైంలేదు" అంటూ నాన్నగారు హడావుడిగా బయటకు వెళ్ళిపోయారు.

"ఇంటి పనితో కణం తీరికలేక నేఛస్తూంటే దేశ సమస్యలూ, ప్రపంచ సమస్యలూ నన్నేమీ అడక్కే" అంటూ అమ్మవెళ్ళిపోయింది.



"జీవితమంటేనే సమస్యల నిలయం - ఉన్న సమస్యలు మరచిపోటానికి కథలు చెప్పుకోవాలి. అందరి సమస్యలు మనం గుర్తుకు తెచ్చుకోటమెందుకు? రారా నీకో కథ చెప్తాను" అని తాతయ్యగారు తమ్ముడిని తీసుకు వెళ్ళారు.

"బుజ్జిగాడికి సెర్‌లాక్ పెట్టాలి ఇప్పటికే బాగా లేటయింది" అని అక్కయ్య వెళ్ళిపోయింది.

అమ్మమ్మ మటుకు నా దగ్గరికి వచ్చి సోఫాలో నా ప్రక్కన కూర్చుని "ఇంతకీ ఏం కనబడట్లేదు అన్నావ్?" అని మళ్ళీ ప్రశ్నించింది.

'మనశ్శాంతి' అని అన్నాను.

ఎప్పుడూ ఉండదు?

"మనశ్శాంతి ఎందుకులేదు!"

"మనసుకి అశాంతి కలిగినపుడు"

"అశాంతి ఎందుకు వస్తుంది?"

"అబ్బ చీమా చీమా కథలోలా ఏమిటీ ప్రశ్నలు అమ్మమ్మా! మనం అనుకున్న పనులు జరగనపుడు?"

"అనుకున్న పనులు అంటే ఏమిటో చెప్పు తల్లీ"

"బోలెడు. మెడిసినో, ఇంజనీరింగో చదవాలను కుంటారు కొందరు, సీటురాలేదని వాళ్ళకి అశాంతి!

సరైన చదువుకి తగ్గ ఉద్యోగాలు లేక కొందరికి అశాంతి.

చదువూ, సంపదా ఉన్నా తగిన జోడు దొరక్క ఇంకొందరికి అశాంతి. పెళ్ళయినా పిల్లలు లేరని కొందరికి బాధ!

పిల్లలు చెప్పిన మాటలు వినక, సరిగ్గా చదవక, చెడిపోతున్నారని మరికొందరి బాధ.

తల్లిదండ్రులు తమని అర్థం చేసుకోవట్లే దని పిల్లల బాధ!

"చిన్నప్పట్నుండి ఎంతోసేవ చేస్తే కాని పిల్లలు పెరిగి పెద్దవాళ్ళ వారు. ఎన్నో సమస్యల నెదుర్కొని వాళ్ళకి చదువు చెప్పించి, పెళ్ళిచేస్తే తీరా వృద్ధాప్యంలో మమ్మల్ని సరిగ్గా చూడట్లేదూ అని తల్లిదండ్రుల బాధ"

నేను ఆపగానే అమ్మమ్మ చెప్పటం మొదలు పెట్టింది.

"మన దైనందిక జీవితంలో ఆర్థిక సమస్యలతో పాటు ఇలాంటి అనేక సమస్యలు ఎదుర్కోవాలి. తప్పదు మరి. కాని ఈ సమస్యలు చాలడంలేదని మనవాళ్ళు తిన్నది అరక్క కొన్ని సమస్యలు సృష్టించుకొని తాము బాధపడుతూ, ఎదుటివాళ్ళను బాధ పెడ్తారు"

"తిన్నది అరగక సమస్యలు తెచ్చుకోవటమా? అంటే అవి ఎలాంటి సమస్యలు అమ్మమ్మా" ఆశ్చర్యంగా అడిగాను.

"ఔను. వీటిలో కూడా ఎన్నో రకాలున్నాయి తల్లీ! నేను టైమ్‌కి వచ్చాను. వాడు రాలేదు.

నేను ఇంత పనిచేశాను. వాడు ఏమాత్రం చేయలేదు.

నేను ఇన్ని మంచి పనులు చేశాను. కాని వాడు ఒక్కటి కూడా చేయలేదు.

ఇతరులు ఏ పనిచేసినా కావాలని వాళ్ళని విమర్శించటం.

ఇతరులు ఎన్ని మంచి పనులు చేసినా అవి వక్రబుద్ధితో చూసి వాటిని చెడుగా ప్రచారం చేయటం.

"ఇతరులను విమర్శించి తద్వారా తాము గొప్ప వాళ్ళు కావాలని ఆశించటం ఇలాంటివి!"



## యంత్రం

"మీ ఫ్యాక్టరీ తగలబడిపోయిందని తెలిసి చాలా బాధపడ్డాను! అవునింతకీ మీ ఫ్యాక్టరీలో ఏం తయారు చేస్తారు?" అడిగాడు వంశీ.

"మంటలార్పే యంత్రాలని..." చెప్పాడు మేనేజర్.

-పి.వి.మురళీ కృష్ణ
ఇ.నం.16-11-418/3/2
ఆంధ్రా లా టైమ్స్ దగ్గర
దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్-500 036.

"మరి ఇంతకీ మనకి మనశ్శాంతి కావాలంటే ఏమి చేయాలి అమ్మమ్మా?"

"నీకు మనశ్శాంతి కావాలంటే ఇతరుల లోపాలు లెక్కపెట్టకు. ప్రతివారిలో మంచీ, చెడూ ఉంటాయి. వారిలోని మంచిని మాత్రమే ఆదర్శంగా తీసుకో.

ఇతరుల చెడు ప్రవర్తన గురించి ఆలోచిస్తే నీకు అశాంతి ఏర్పడి నీవు చేయవలసిన పనులు కూడా చేయలేవు.

"మన మాటల ద్వారా కాని, చేతల ద్వారా కాని ఎవర్నీ నొప్పించకూడదు అని ప్రతివాళ్ళూ అనుకుంటే ప్రతి మనిషికి మనశ్శాంతి దొరకటమే కాక ప్రతి ఇల్లూ, ప్రతి దేశమూ శాంతి నిలయంగా మారిపోతుంది."

\+ + +

ఈరోజు ఆదివారం. లయన్స్ క్లబ్‌లో ఏదో ఫంక్షన్ ఆర్గనైజ్ చేయాలని నాన్నగారు హడావుడిగా వెళ్ళారు.

తన కిష్టమైన పాత పిక్చర్ టీ.వీలో వస్తుందని అమ్మ స్పీడ్‌గా పనిచేసుకుంటోంది.

టీవీలో క్రికెట్ చూడాలని తమ్ముడు చకచకా హోంవర్క్ చేసుకుంటున్నాడు.

ప్రభాత్ థియేటర్‌లో మంచి హిందీ పిక్చర్ వచ్చిందనీ. సాంగ్స్, జోక్స్ చాలా బావున్నాయి వెడదాం రమ్మంటే నేను రానన్నానని నామీద కోపంతో వాళ్ళ ఫ్రెండ్స్‌తో కలసి వెళ్ళటానికి నిర్ణయించి, బుజ్జిగాడి పనులన్నీ త్వరత్వరగా ముగిస్తోంది అక్కయ్య.

తాతయ్యగారు పక్కింటి రామనాథం గారితో కబుర్లలోకి దిగారు.

ఇంతకీ అమ్మమ్మ ఎక్కడుందా అని చూస్తే డాబా మీద చెట్టు నీడలో భగవద్గీత చదువుకుంటూ కనపడింది.

దగ్గరగా వెళ్ళి "అమ్మమ్మా ఇంకా చదవటం పూర్తి కాలేదా?" అని అడిగాను.

"ఎన్నిసార్లు చదివినా ఏదో క్రొత్త అర్థం వస్తూనే ఉంటుంది. నా చదువుకేం గానీ ఏదో అడగాలని వచ్చినట్లున్నావ్?" అని అమ్మమ్మ పుస్తకం మడిచి ప్రక్కన పెట్టింది.

నేను కూడా అమ్మమ్మ ప్రక్కనే కూర్చుంటూ "ఒక చిన్న సందేహం అమ్మమ్మ.

"నిన్న నీవు మాటల ద్వారా, చేతల ద్వారా ఎవర్నీ నొప్పించవద్దు అని అన్నావు కదా! మరి మా హెడ్ మాస్టర్ బాగా స్ట్రిక్ట్. తన మాటల ద్వారా విద్యార్థులనూ, టీచర్లనూ ఎప్పుడూ నొప్పిస్తూ ఉంటారు. మరి అది కూడా తప్పే నంటావా?"

"అది ఎప్పటికీ తప్పుకాదు. వేయిమంది విద్యార్థుల భవిష్యత్తు హెడ్ మాస్టర్ గారి చేతిలో ఉంటుంది. హెడ్ మాస్టర్ గారు స్ట్రిక్ట్‌గా ఉన్నప్పుడే ఉపాధ్యాయులూ, విద్యార్థులూ తమ విధి నిర్వాహణ సక్రమంగా చేస్తారు. తద్వారా మంచి రిజల్ట్స్ వస్తాయి. అప్పుడు టీచర్లూ, విద్యార్థులూ, తల్లిదండ్రులూ అందరూ సంతోషపడ్తారు కదా!

"అమ్మమ్మ - నాది మరో సందేహం! పక్కింటి పంకజాన్ని అత్తా, మామా, ఆడపడుచులూ అస్తమానూ సాధిస్తున్నారని వాళ్ళబ్బాయిని పిలిచి వేరే ఉండమని సలహా ఇచ్చావు కదా! మరి వాళ్ళు వేరు కాపురం పెట్టారు. దాంతో వాళ్ళందరూ ఎంత బాధ పడ్డారో తెలుసా? మన వల్లనే ఇలా జరిగిందని మనతో మాట్లాడ టం కూడా మానేశారు"

"ఆదానికి నేనేమీ బాధ పడటం లేదమ్మ! దూరంగా ఉన్నవాళ్ళు! అబ్బాయి వాళ్ళ కష్ట సుఖాలలో పాలు పంచుకుంటున్నాడు కదా! చెల్లికి కట్నమిచ్చి పెళ్ళి చేశాడు. వాళ్ళ నాన్నగారు, హాస్పిటల్లో ఉన్నప్పుడు తను కూడా వచ్చి హాస్పిటల్లో ఉన్నాడు. అత్తయ్యగారు విచారంగా ఉన్నారని కోడలు వంటచేసి హాస్పిటల్‌కి పంపేది. వాళ్ళు బయటికి వెళ్ళి కనే అందరూ ఎవరి పనులు వాళ్ళు చేసుకోవటం మొదలు పెట్టారు. తనే తమ్ముడికి చదువు చెప్పిస్తున్నాడు. అలా బయటకు వెళ్ళడం వల్లనే కదా అందర్లా అతను కూడా భార్యా, పిల్లలతో ఆనందంగా గడపగల్గుతున్నాడు. వీళ్ళు మనతో మాట్లాడనంత మాత్రాన మనకి వచ్చిన నష్టమేముంది? నేను ఇచ్చిన సలహా వల్ల అందరూ బాగుపడ్డారన్న తృప్తి నాకుంది..."

అమ్మమ్మ విసుక్కోకుండా చక్కగా వివరిస్తోంది! అందుకే... అమ్మమ్మతో కబుర్లంటే నాకు చాలా ఇష్టం!

-కె.విజయలక్ష్మి,
బోధన్.

★